క్లుప్తంగా

ఘనంగా శంకరంబాడి జయంతి

పెనుగొలను(గంపలగూడెం): ఆంధ్ర రాష్ట్ర గీత రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతి కార్యక్రమం పెనుగొలను షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు జాతి గర్వించే రీతిలో శంకరంబాడి మా తెలుగు తల్లికి మల్లె పూదండ, సుందర భారతం, జపమాల తదితర గొప్ప రచనలు చేశారని వక్తలు కొనియాడారు. సేవా కమిటీ ప్రతినిధులు లింగమ్మ, వూటుకూరు యజ్ఞ కృష్ణ, ముక్కెర శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చీమలపాడులో పారిశుద్ధ్య పనులు

ఎ.కొండూరు: చీమలపాడులో సర్పంచ్ మోర్ల లక్ష్మి ఆధ్వర్యంలో శనివారం రహదారికి ఇరువైపులా మురుగునీరు పారే విధంగా పూడిక తీత పనులు నిర్వహించారు. మురుగు నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చల్లించారు. తాగునీటిని క్లోరినేషన్ చేయించారు. దోమలు వృద్ధి చెందకుండా దోమల మందు ఫాగింగ్ చేయించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



ఆగిరిపల్లి: గోపాలపురంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో సీతారామ లక్ష్మణ సమేత హనుమాను స్వామి వార్ల ఆలయ ధ్వజ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9.29 గంటలకు సీతారామస్వామి వార్ల విగ్రహ, విమాన శిఖర, జీవధ్వజ, వాస్తు శుద్ధి, పూర్ణాహుతి, సీతారాముల కల్యాణం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. మంత్రి కొలుసు పార్థసారథి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

జీతం బకాయిలు చెల్లించాలి

నూజివీడు: పాఠశాలల పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలల జీతం బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. హరినాథ్ డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిబంధనలు పాటించకుండా అనేక చోట్ల పారిశుద్ధ్య కార్మికుల అక్రమ తొలగింపులు జరుగుతున్నాయన్నారు. నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో వారు ఆర్థిక భారంతో రోడ్డున పడ్డారని హరినాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యను బట్టి వారి జీతాల్లో కోత విధిస్తామనే మరో పిడుగు లాంటి వార్త వినిపిస్తోందని, ఇది అన్యాయమన్నారు. ఈ విధానాలు విడనాడాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన నాగళ్ల సంకీర్తన

జి.కొండూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి, యువకుడు ఇద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలవరానికి చెందిన షేక్ జాఫర్, గుంటుపల్లికి చెందిన నాగళ్ల సంకీర్తన ఇద్దరూ తమ ద్విచక్ర వాహనంపై మైలవరం నుంచి శనివారం రాత్రి 9 గంటల సమయంలో విజయవాడ వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో జి.కొండూరు బైపాస్‌రోడ్డులోని పులివాగు వంతెన వద్దకు రాగానే రహదారిపై ఏర్పడిన గుంతల కారణంగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్‌ఐ షబ్బీర్ అహ్మద్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చిన్నారులు క్రీడల్లో రాణించాలి



పటమట(విజయవాడతూర్పు): చిన్నారులు క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి వీఎంసీకి ఖ్యాతి తీసుకురావాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం నగర పర్యటనలో భాగంగా ఆయన పటమట ఫన్‌టైం క్లబ్, గురునానక్ కాలనీ, కన్నా నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఫన్ టైం క్లబ్‌లో వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న చిన్నారులతో ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆటల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని వారికి సూచించారు. అక్కడున్న వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తర్వాత పటమటలోని ఖన్నానగర్ ప్రాంతంలో పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. ఖాళీ ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని యజమానులకు సూచించారు.

ముంపులో పంట పొలాలు

- 200 ఎకరాల్లో పంట నష్టం
- నష్ట నివారణ చర్యలు చేపట్టాలని అధికారుల సూచనలు
- పంటలు దెబ్బతింటాయని రైతుల ఆందోళన



దాములూరులో వరద ముంపునకు గురై రంగుమారిన మినుము పైరు

ఇబ్రహీంపట్నం: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్ట్ నుంచి కృష్ణానదికి వచ్చిన వరద, పొంగిపొర్లుతున్న మున్నేరు వరద ప్రవాహం పంట పొలాలను ముంచేసింది.

వరి, పత్తి, మునగ, మొక్కజొన్న, అపరాల పంటలు ముంపునకు గురయ్యాయి. వరద నీటి ముంపునకు గురైన పంట పొలాల లెక్కలను వ్యవసాయ శాఖాధికారులు తేల్చేపనిలో పడ్డారు. పది గ్రామాల పరిధిలో ఇప్పటివరకు 93 మంది రైతులకు చెందిన (81.1 హెక్టార్లు) 200 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు లెక్కించారు.



శైలజ, వ్యవసాయాధికారి, ఇబ్రహీంపట్నం

నీట మునిగిన వందల ఎకరాలు..

జూపూడి, త్రిలోచనాపురం, కిలేశపురం, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో ఎక్కువగా వరి సాగు చేశారు. వరద ప్రభావంతో సుమారు 80 ఎకరాల వరకు నీటి ముంపునకు గురైంది. కొటికలపూడి, చిలుకూరు, దాములూరు, కాచవరం, లంక గ్రామాల్లో మెట్ట పైరుగా పత్తి, పసుపు, మొక్కజొన్న, కూరగాయలు, అపరాల సాగు చేపట్టారు. వీటిలో సుమారు 120 ఎకరాలు మొత్తం 200 ఎకరాల వరకు వరద నీటి ముంపునకు గురైనట్లు వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ముంపునకు గురైన పంటలను కాపాడుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులతో నష్టం నివారణ..

గత మూడు రోజులుగా వరద ముంపునకు గురైన పంటలు కొంతమేర దెబ్బతినే అవకాశం ఉంది. భూమిలో తేమ శాతం పెరిగి తెగుళ్లు, సూక్ష్మ ధాతు లోపాలు ఎక్కువగా కనిపిస్తాయి. తగిన జాగ్రత్తలు పాటిస్తే కొంతమేర నష్టాలు తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి డి.శైలజ తెలిపారు. వెంటనే నష్ట నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు ఆమె పలు సూచనలు చేశారు. అవి..

- వరి నారుమడి నీటిముంపుకు గురైతే ఐదు రోజుల్లో నీటిని పూర్తిగా బయటకు పంపాలి. ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్, రెండు గ్రాముల కార్బండిజమ్, మాంకోజెట్ పిచికారీ చేయాలి. నాటేసిన వరి పైరు నీటిలో మునిగితే 20 కిలోల చొప్పున యూరియా, పొటాష్ చల్లుకోవాలి.
- ముంపునకు గురైన వరి పైరులో పొడతెగులు ఆశిస్తుంది. రెండు మిల్లీ లీటర్లు హెక్సాకోనోజోల్ ఒక లీటర్ నీటిలో కలిపి చల్లాలి.
- అగ్గితెగులు నివారణకు ఒక లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్, 1.25 గ్రాములు మాంకోజెబ్కాలిపి కలిపి పిచికారీ చేయాలి. ఖాళీలు ఏర్పడిన వరిపైరులో మరలా మొక్కలు నాటాలి.
- 30 రోజుల దశలో ఉన్న పత్తి పంట నీటిలో మునిగితే వీలైనంత త్వరగా నీటిని బయటకు తీసివేయాలి. 20 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఎరువులు వేసుకోవాలి.
- మొక్కలు వడబారితే మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, 100 మిల్లీ గ్రాముల స్ట్రెప్టో సైక్లిన్ వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు మొక్కలపై చల్లాలి.
- ఆకుమచ్చ పురుగు తెగుళ్ల నివారణకు ఒక లీటరు నీటిలో ఒక మిల్లీలీటరు ప్రొపికోనాజోల్ కలిపి పిచికారీ చేయాలి. పచ్చదోమ నివారణకు మోనోక్రోటాఫాస్ 1.6 మిలీలీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి చల్లుకోవాలి. తెల్లదోమ నివారణకు ట్రైజోఫాస్ 2 మి.లీ ఐదు శాతం వేపనూనె, వేపగింజల కషాయంతో కలిపి పిచికారీ చేయాలి.
- మొక్కజొన్నలో నిలిచిన అధిక నీటిని బయటకు తీసి లీటర్ నీటికి ఐదు గ్రాముల చొప్పున మల్టీకే (13-03-45) పిచికారీ చేసుకోవాలి.
- మొక్కలు వడబడితే లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్లు రిడామిల్ గోల్డ్ కలిపి చల్లాలి.
- అపరాలలో ఇనుపధాతువు లోప నివారణకు అన్నబేది 50 గ్రాములు, ఐదు గ్రాముల నిమ్మఉప్పు, 150 గ్రాముల యూరియా 10 లీటర్ల నీటిలో కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు మూడు గ్రాముల మాంకోజెబ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

టీడీపీలో పదవుల కుంపటి

- సొంతవర్గాన్ని సిద్ధం చేసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు
- సీనియర్లకు మొండిచేయి
- కార్యక్రమాలకు దూరంగా సీనియర్లు
- అధిష్టానం వద్దకు తిరువూరు పార్టీ పెద్దలు

తిరువూరు: నామినేటెడ్ పదవుల వ్యవహారం తిరువూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో కలకలం రేపుతోంది. పార్టీ స్థాపించినప్పటి నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న నేతలను పక్కన పెట్టిన ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు కొత్తవారికి అవకాశం కల్పిస్తారని ప్రచారం జరుగుతోంది. ఎన్నికలకు ముందు, తర్వాత కూడా ఎమ్మెల్యే సీనియర్లకు గుర్తింపు ఇవ్వకపోవడంతో వారు నేరుగా అధిష్టానం వద్దకు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. విస్సన్నపేట మండలంలో సీనియర్ నాయకుడు బుడ్డయ్యను పార్టీ నుంచి బయటికి పొమ్మని ఎమ్మెల్యే ఖరాకండిగా చెప్పడం, మరో సీనియర్ నేత నెక్కళపు శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలకు ఆహ్వానించగా, ముఖం చాటేయడంతో ఆ మండలంలో టీడీపీ నాయకులు కినుక వహించారు. పార్టీ కార్యక్రమాల్లో సైతం గతంలో చురుకుగా పనిచేసిన నాయకులు కనిపించట్లేదు. ఎమ్మెల్యే పర్యటన సమాచారం ఎవరికీ తెలియట్లేదని మండల స్థాయి నేతలు చెబుతున్నారు.

నామినేటెడ్ పదవుల కోసం ప్రదక్షిణలు..

తిరువూరు నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న నాయకులు తమవంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్ల పదవులు, నెమలి, పుట్రేల, మేడూరు దేవాలయాలు, తిరువూరు గ్రూపు దేవాలయాల పాలకవర్గాలలో తమకు అవకాశం కల్పించాలని ఆశావహులు టీడీపీ జిల్లా నాయకుల వద్ద పైరవీలు చేస్తున్నారు. తిరువూరు ప్రభుత్వాస్పత్రి, నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి కమిటీలను, షాదీఖానా నిర్వహణ కమిటీని కూడా నియమించనున్నారు. గతంలో నామినేటెడ్ పదవులు చేసిన వారికి ఈసారి అవకాశం లేదని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చెప్పినట్లు తెలుస్తోంది. వీటితో పాటు రాష్ట్ర కార్పొరేషన్లు, జిల్లా, రాష్ట్ర స్థాయి పదవుల కోసం కూడా సీనియర్లు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు



చంద్రాల(మైలవరం): మైలవరం మండలం చంద్రాల గ్రామంలో వీధి కుక్కల దాడిలో ఆరేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. చంద్రాల గ్రామం బీసీ కాలనీకి చెందిన కుప్పాల స్వామి, కోటేశ్వరమ్మల కుమారుడు దీపు (6) శనివారం వీధిలో ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన బాలుడిని మైలవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వీధి కుక్కలను నియంత్రించాలి..

వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బి.దాస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. వీధి కుక్కలు గ్రామాల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని చెప్పారు. వీటి నియంత్రణకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌తో ఆదాయం



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న డీపీఓ శివకుమార్ యాదవ్



జి.కొండూరు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

జి.కొండూరు: సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను అమలులోకి తీసుకురావడం వల్ల గ్రామాల్లో చెత్తాచెదారం సమస్య తీరిపోవడంతో పాటు గ్రామ పంచాయతీలకు ఆదాయం లభిస్తుందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శుల రెండో రోజు శిక్షణ తరగతులకు ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రామాలలో తడి, పొడి చెత్త సేకరణ, యూనిట్లలో వాటిని నిల్వ చేసే విధానం, వర్మి కంపోస్టు తయారీ విధానం, రైతులకు ఎరువును విక్రయించడం వంటి అంశాలను జి.కొండూరు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ వద్ద సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎంపీడీఓ శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో వివరించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

సర్పంచుల క్షేత్ర సందర్శన

తిరువూరురూరల్: గ్రామ పంచాయతీ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు తిరువూరులో రెండో రోజు శిక్షణ తరగతులు శనివారం కొనసాగాయి. దీనిలో భాగంగా మండలంలోని లక్ష్మీపురంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. గ్రామాల్లో చెత్త సేకరించిన తర్వాత డంపింగ్ యార్డుకు తరలించడం, చెత్తతో వర్మికంపోస్టు తయారీ తదితర అంశాలను ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ వెంకటరత్నం వివరించారు.

గ్రామాలను అభివృద్ధిపథంలో నిలపాలి..

ఇబ్రహీంపట్నం: గ్రామాలను అభివృద్ధిపథంలో నిలిపేందుకు సర్పంచులు, కార్యదర్శులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శివకుమార్ యాదవ్ అన్నారు. ఇబ్రహీంపట్నం ఎంపీపీ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అభివృద్ధి ప్రణాళికలపై జరిగిన శిక్షణ సదస్సు ముగింపు సమావేశంలో శనివారం ఆయన పాల్గొన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం నిర్వహణకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. దోమల నివారణ, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ గ్రాంట్లతో పాటు ఆదాయం పెంచుకునే మార్గాలు అన్వేషించాలని సూచించారు. ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, ఈఓపీఆర్డీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ మనోజ్‌కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి..

విస్సన్నపేట: సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి, ప్రజలకు వసతుల కల్పనకు కృషి చేయాలని ఎంపీడీఓ జి. విజయకుమారి అన్నారు. మండలంలోని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, పరిపాలనపై రెండో రోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధితో పాటు ఆదాయం పెంచుకునే అంశాలపై అనేక సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి, ఏపీఓ అనురాధ పాల్గొన్నారు.

జి. కొండూరు: సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎంపీడీఓ ఎస్. ఆశీర్వాదం మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దయానంద్, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలి..

ముసునూరు: పంచాయతీరాజ్ విభాగంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సాయిరామ్ అన్నారు. ముసునూరు ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు గ్రామాల అభివృద్ధి, పారిశుద్ధ్యం నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు, కార్యదర్శులు పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. రిసోర్స్‌పర్సన్ విద్యాధర్ పంచాయతీల పరిపాలనపై అవగాహన కల్పించారు.

బలివే వంతెన పనులు వేగవంతం చేయండి

మంత్రి పార్థసారథి



వంతెన పనులు పరిశీలించి మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, ఆర్డీఓ

ముసునూరు: బలివే తమ్మిలేరుపై పనులు నిలిచిపోయిన వంతెనపై పాదచారులు, విద్యార్థులు నడిచి వెళ్లేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖా మంత్రి కె. పార్థసారథి అధికారులను ఆదేశించారు. మండలంలోని బలివే వద్ద నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బలివే వంతెన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయించాలని నీటిపారుదల శాఖ ఎస్‌ఈ దేవప్రకాష్‌ను ఆదేశించారు. అంతవరకు విద్యార్థులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని, వాహనాల రాకపోకలకు అనుమతించ వద్దని చెప్పారు. పనులు నిలిచిపోయిన విషయంపై మాట్లాడుతూ విజయరాయి వైపు నిలిచిపోయిన భూసేకరణ విషయంపై రైతులతో ఫోన్లో మాట్లాడి సహకరించాలని కోరారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత గోపవరం హైస్కూల్‌లో మినరల్ వాటర్ ప్లాంట్‌ను పునః ప్రారంభించారు. నూజివీడు ఆర్డీఓ భవానీశంకరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ



మర్రిబంధం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ రామకృష్ణ

నూజివీడు: వాహన చోదకులు నిబంధనలు పాటించాలని నూజివీడు రూరల్ సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సీఐ వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు చూపని డ్రైవర్లకు జరిమానాలు విధించారు. ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా తమ వాహనానికి సంబంధించిన సీ బుక్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్‌లతో పాటు తమ డ్రైవింగ్ లైసెన్స్‌ను సైతం దగ్గర ఉంచుకుని అధికారులు అడిగినప్పుడు చూపించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే మైనర్లతో పాటు వాహనం ఎవరి పేరుపై ఉందో వారిపైన కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడిపినప్పుడు ప్రమాదానికి గురైతే వాహన యజమానిపైనా కేసు నమోదు చేస్తామని, ప్రతి ఒక్కరూ చట్టప్రకారం నడుచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయమైన చర్య



మైలవరం: విజయవాడలోని సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం శిలాఫలకం ధ్వంసం చేయడాన్ని దళిత నాయకులు తీవ్రంగా ఖండించారు. మైలవరంలో దళిత నాయకులు మండల పరిషత్ కార్యాలయం రోడ్డు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు మందా నోవా మాట్లాడుతూ విగ్రహ శిలాఫలకం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో టీడీపీ నాయకుల హింసాత్మక ఘటనలను అందరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తొమ్మండ్రు ఏసు, జోజిబాబు, రమేష్, వెల్వడం సర్పంచ్ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందంజ



టెట్ అండ్ డీఎస్సీ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించిన యూటీఎఫ్ నాయకులు

మైలవరం: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మైలవరం సీపీఎం కార్యాలయం వద్ద శనివారం జెండాను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందుంటుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యావేత్త, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రచురించిన టెట్ అండ్ డీఎస్సీ మెటీరియల్‌ను యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గంగరాజు, మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు ధన్యవాదాలు తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

విస్సన్నపేట: ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ నిరంతర పోరాటం చేస్తోందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీసీహెచ్‌వీ సూర్యనారాయణ అన్నారు. యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. యూనియన్ మాజీ గౌరవాధ్యక్షుడు దుగ్గి శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షురాలు కె. చైతన్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పి. రామకృష్ణారెడ్డి, బీవీ రామారావు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని సి గుడిపాడు హైస్కూల్లో యూటీఎఫ్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు పంతగాని వీర కోటి, నాయకులు చీదిరాల రఘు, జీఎస్ఎన్ రెడ్డి, రత్తయ్య, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా శనివారం ముసునూరులో ఉపాధ్యాయ నేతల ఆధ్వర్యంలో యూటీఎఫ్ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కౌన్సిలర్ డి. బెనర్జీ, జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు పద్మకిషోర్, నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు



నూజివీడు పెద్ద చెరువు కింద వరినాట్లు వేస్తున్న కూలీలు

నియోజకవర్గంలో 80 శాతం విస్తీర్ణంలో పూర్తి

నూజివీడు: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ఆశాజనకంగా పడుతుండటంతో నూజివీడు నియోజకవర్గంలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లో ఖరీఫ్‌లో రైతులు ప్రధానంగా వరి పంటను సాగు చేస్తారు. నూజివీడు, ముసునూరు మండలాల్లో మాత్రం వరితో పాటు మొక్కజొన్న సాగు చేస్తారు. భారీ వర్షాలు, మోస్తరు వర్షపు జల్లులు పడటంతో నియోజకవర్గంలోని చెరువుల్లో కొంతమేరకు నీరు చేరింది. దీంతో రైతులు వరినాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రధానంగా చెరువుల ఆధారంతోనే నియోజకవర్గంలో వరి పంట సాగవుతోంది. వ్యవసాయ బోర్ల కింద సైతం వరి సాగు చేస్తున్నారు.

27 వేల ఎకరాల్లో వరి సాగు..

నూజివీడు మండలంలో 4 వేల ఎకరాలు, ఆగిరిపల్లి మండలంలో 10 వేల ఎకరాలు, ముసునూరు మండలంలో 4 వేల ఎకరాలు, చాట్రాయి మండలంలో 9 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తారు. చెరువులు నిండకపోయినప్పటికీ భారీ వర్షాలకు మడులలో నిలుస్తున్న వర్షం నీటితోనే వరినాట్లు వేస్తున్నారు. వీటికి తోడు వ్యవసాయ బోర్లు ఉండటంతో నాట్లు వేసిన తరువాత సాగునీరు అవసరమైతే బోర్ల నీటిని పెట్టుకుంటున్నారు. ఇప్పటి వరకు సుమారు 80 శాతం విస్తీర్ణంలో వరినాట్లు పూర్తయ్యాయి.

వెదసాగుకు మొగ్గు..

రైతులు వెదసాగు వైపునకే మొగ్గు చూపుతున్నారు. కూలీ రేట్లు పెరగడంతో పాటు దమ్ము ఖర్చులు, వరినారు పోసే ఖర్చు, నాట్లు వేసే ఖర్చు కలిసి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. వెదజల్లడం వల్ల సమయం కూడా కలిసి వస్తోందని చెబుతున్నారు. ఈనెలాఖరు కల్లా చెరువులు నిండితే ఖరీఫ్ సాగు ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా సాగిపోతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు వాతావరణం అనుకూలించడంతో రైతులు ఆశాభావంతో ముందుకు సాగుతున్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: శ్రీకళాంజలి కళాపరిషత్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శనివారం నిర్వహించిన ఆపాత మధురాలు సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకుడు ఆర్.వేణు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు ఆర్‌వీ రమేష్, కె.అన్నపూర్ణ, ఒ.రాజ్యలక్ష్మి, మహేశ్వరి, టీవీ శేషగిరిరావు, రవి కుమార్, శ్రీనివాసకుమార్, రవి శంకర్, ఎస్‌కే వలి, వైవీ రావ్, దయానంద్‌లు పలు చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకుడు వేణు మాట్లాడుతూ గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. గాయకులు నిత్యం సాధన చేయాలని కోరారు.